# బ్యాంక్‌లను కొల్లగొడుతున్న బడా పరిశ్రమాధిపతులు

**వేలాదికోట్ల** ప్రజాధనాన్ని బ్యాంక్‌లకు మూలధనంగా పాలకులు సమకూర్చిపెడుతున్నారు. ఆ ప్రజలకు మాత్రం బ్యాంక్‌లు చేయూత ఇవ్వటం లేదు. ప్రజల సొమ్మును బడా పరిశ్రమాధిపతులకు, సంపన్నవర్గాలకు, భూస్వాములకు పెద్దఎత్తున సమకూర్చిపెడుతున్నారు. రైతులు, చిరువ్యాపారులు, చిన్న పరిశ్రమదారులు, చేతివృత్తులవారు రుణాల కోసం బ్యాంక్‌లను ఆశ్రయిస్తే అనేక షరతులు పెట్టి చాలా కొద్దిమందికి మాత్రమే నామమాత్రపు రుణాలు యిచ్చే బ్యాంక్‌లు, బడా పరిశ్రమాధిపతులకు అనేక రాయితీలతో వేల కోట్ల రూపాయలు రుణాలుగా అంద చేస్తున్నాయి. పాలకులు కూడా వీరికి సంవత్సరానికి 4 లక్షల కోట్లకు పైగా రాయితీలు ప్రకటిస్తున్నారు.

సేద్యంకోసం రైతులు, బ్రతుకుతెరువుకోసం చిరువ్యాపారులు, చేతివృత్తిదారులు, జాతీయ స్వభావం కలిగిన చిన్న పరిశ్రమదారులు నష్టపోయి ఒక సంవత్సరం బ్యాంకు రుణాలు చెల్లించకపోతే ఇంట్లో సామానులు, పశువులు, పొలం జప్తు చేయటం, చిన్న పరిశ్రమల గేట్లు మూసివేసే బ్యాంక్ అధికారులు, అందుకు ఆమోదం తెలుపుతున్న పాలకులు – బడా పరిశ్రమాధిపతులు వేల కోట్లు చెల్లించకపోయినా, వారి నుండి బకాయిలు రాబట్టే చర్యలు తీసుకోవటంలేదు. మొండిబకాయిల పేరుతో వారు తీసుకొన్న రుణాలను రద్దుచేస్తున్నారు. దీన్ని గమనిస్తే పాలకులు, బ్యాంక్‌లు ఎవరి ప్రయోజనాలను పరిరక్షిస్తుందీ అర్థమౌతున్నది.

దేశీయ బ్యాంక్‌లు ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంక్‌ల మొండి బకాయిల (ఎన్.పి.ఏ.) సమస్య ఎక్కువగా ఉందని, ఫలితంగా బ్యాంక్ బ్యాలెన్స్‌షీట్ ప్రక్షాళనకు ఎక్కువ సమయంతోపాటు, ఎక్కువ ఖర్చు కూడా అయ్యేటట్లు ఉందని రాయిటర్ వార్తాసంస్థ పరిశోధన నివేదిక వెల్లడించింది. బ్యాంక్ ఖాతాల ప్రక్షాళనకు ఆర్.బి.ఐ. నిర్దేశించిన గడువైన 2017 మార్చి నాటికి అన్ని బ్యాంక్‌లు, తమ ఖాతాలపరంగా వసూలుకాని అన్నిరకాల మొండి బకాయిల లెక్కలు ప్రకటించాలి.

రాయటర్ వార్తా సంస్థ ఇటీవలనే ఆర్.బి.ఐ. నుండి ఎన్.పి.ఏ. వివరాలను సేకరించింది. ఆ వివరాల ప్రకారం గత సంవత్సరం డిసెంబర్‌నాటికి ఎన్.పి.ఏ.లు 121 బిలియన్ డాలర్లు ఉండగా ఈ సంవత్సరం జూన్‌నాటికి 138.5 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు అంచనా వేయబడింది. ఇది 15 శాతం పెరుగుదలగా ఉంది. ఎన్.పి.ఏ.ల్లో 122 బిలియన్ డాలర్లు ప్రభుత్వరంగ బ్యాంక్‌లవి కాగా, ప్రైవేట్ బ్యాంక్‌ల వాటా 14 బిలియన్ డాలర్లు, విదేశీ బ్యాంక్‌లవి 2.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీన్ని గమనిస్తే ఎన్.పి.ఏల్లో 90 శాతంపైగా ప్రభుత్వ బ్యాంకుల్లోనే ఉన్న వాస్తవం బయటకు వచ్చింది.

90 రోజులకుపైగా ఎలాంటి చెల్లింపులు లేని నిరర్థక ఆస్తుల, పునరుద్ధరించిన ఆస్తుల ఖాతాల ప్రక్షాళనకు ఆర్.బి.ఐ ఆదేశించాక ఎన్.పి.ఏ. పెరుగుతున్నదని, లోగడ పునరుద్ధరించిన ఆస్తులు నిరర్థక ఆస్తుల జాబితాలోకి చేరుతున్నట్లు బ్యాంక్‌లు స్పష్టం చేశాయి.

బడా పరిశ్రమాధిపతులు నష్టాలపేరుతో బ్యాంక్‌లకు చెల్లించాల్సిన అప్పులు చెల్లించకపోవటం, వాటిని నిరర్థక ఆస్తులుగా బ్యాంక్‌లు ప్రకటించటం, తిరిగి పాలకులే, పరిశ్రమాధిపతులకు వడ్డీ రాయితీతో బ్యాంక్‌ల నుండి రుణాలు ఇవ్వటం బ్యాంకింగ్ వ్యవస్థ, రాజకీయ వ్యవస్థలు బడా పరిశ్రమాధిపతుల ప్రయోజనాలకు ప్రతినిధులుగా ఉన్న వాస్తవాన్ని వెల్లడిచేస్తోంది.

ooooo